ముఖచిత్రం కథానిక :




# స్త్రీ బుద్ధిః....

రచన: మల్లెల వెంకటేశ్వర శర్మ

ఆఫీస్ అంతా నిశ్శబ్దంగా వుంది. ఎవరి పనిలో వారున్నారు. టైపిస్టు శారద ఏవో కాగితాలు చాలసేపటినుంచి టైపు చేస్తున్నది. మధ్యమధ్యజేబుగుడ్డతో మొహం తుడుచుకుంటున్నది. పాపం! ప్రొద్దుట నుంచి ఎంతపనిచేసిందో ఆవిడకే తెలియదు. నేనూ టైపుకొట్టాల్సింది చాలవుంది.

ఇంతలో శెక్రటరీ పిల్చారు. ఆ కాగితాలు యివాళే వెళ్ళాలని అఫీసుకురాగానే చెప్పారు. వెళ్ళి చెప్పివచ్చాను, ఒక గంటలో పంపిస్తానని. మిషన్‌లో కాగితం పెట్టాను. నేను యివాల్టికి యింక టైపు చేయలేను. శారదను అడగాలి? ఆమె వచ్చి రెండు నెలలయినా యింతవరకు ఆమెతో మాట్లాడలేదు. ఏదో ఆఫీసుకు రాగానే విష్‌చేస్తాను కో-టైపిస్టు కాబట్టి ఆవిడకూడ అంతే. నేను యింతవరకు ఆమె సహాయం కోరలేదు. అసలు ఎవరి పని వారికుంటుంది. అర్ధాంతరంగా శలవు పెట్టితే యివ్వరు. ఈరోజు ఏదోవిధంగా గడపాలి.

"శారదా...."

"..........."

"మీకేం అభ్యంతరంలేకపోతే ఈ కాగితాలు కాస్త టైపుచేసిపెట్టారా!"

అదోరకంగా చూచింది. నాకే కష్టమనిపించింది. న్యాయముగా నేనే అవిడకు సహాయము చెయ్యాల్సింది. ఆ శెక్షను కాగితాలు చాల వస్తాయి. ఇదివరకటి టైపిస్టు ఎప్పుడూ గోలపెట్టుండేవాడు. ఈవిడ మరి ఏవిధంగా సర్దుకుపోతుందో?

ఇంతలో ఆమె సన్నగా నవ్వింది.

"పరవాలేదు....యిటుతెండి"

ఒకటే ఆలోచన. మళ్లా యీ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి? ప్రొద్దునవచ్చిన టెలిగ్రామ్ గుర్తుకువస్తున్నది. రాజ్యలక్ష్మి ఒంటరిగా మెయిల్లో వస్తున్నది. నవమాసములు నిండిన గర్భిణి. అక్కడ అవిడకు ఏమీ లోటుండదు. ఇంటినిండా నౌకర్లు పిలుస్తే పదిమంది డాక్టర్లు వస్తారు మరి.?

* * *

ప్రపంచములో అందరూ అదృష్టవంతులుండరు. నిజానికి దురదృష్టవంతులే యెక్కువ.

నాకు యిల్లు వాకిలి వున్నాయి. కొద్దో గొప్పో అస్తి వున్నది. మంచి ఉద్యోగం, చక్కటిభార్య. అందులోను విద్యావతి, కమ్మగా పాడగలదు, కనులకు విందుగా నాట్యంచేయగలదు. కాని బిందెడుపాలకు ఒక విషబిందువు చాలు.

మొదట రాజ్యలక్ష్మితో వివాహానికి నేను సమ్మతించలేదు. మాకంటె అన్నివిషయాలలోను వారి అంతస్తు పెద్దది. ఆమె మొదటి చూపులలోనే మష్మల్నందర్నికూడ సమ్మోహపరచింది. "ఆమె నవ్వేచేస్తుంది వెయ్యి వరహాలు" అంది మా అమ్మ. రాజ్యలక్ష్మి కూడ అన్నదిట, "ఈ సంబంధముతప్పితే యింకొకటి చేసుకోను" అని. కారణం లేకుండానే యిష్టంలేకపోయింది నాకు. నా హృదయం ఎందుకనో సమ్మతించలేదు. ఏమైనా "మా అబ్బాయి అన్ని విధాల అదృష్టవంతుడు"అనే అమ్మ సంతోషాన్ని కాదనలేకపోయాను.

మా వివాహం వైభవంగానే జరిగింది. మొదటిరోజురాత్రి ఆమె చిరునవ్వు నన్ను ముగ్ధుణ్ణిచేసింది.

ఆమెచేతినితీసుకొని మృదువుగా ముద్దు పెట్టుకోబోతే, విసురుగాలాక్కుంటూ అంది "అపని చేయుటకు మళ్ళీ ఎన్నడూ ప్రయత్నించకండి" అని నవ్వులను చిలికే ఆమె మొఖం గంభీరమయింది. చిలిపిగా మాట్లాడే ఆమె కళ్ళు క్రోధంతో నిండిపోయాయి.

అంతే! నామనసు పనిచేయలేదు. నేను మాట్లాడలేకపోయాను.

కాసేపుండి "మీరు యిక్కడే పడుకోండి" అంటూ నేలమీద ఒక దుప్పటి దిండూ పడేసి, తను ఆ "హంసతూలికా తల్పంపై పడుకొని నిశ్చలంగా నిద్రపోయింది.

కుర్చీలో కూలబడ్డాను. గడియారము రెండు కొట్టింది. వెంటనే లేచి సూట్‌కేస్ అదీ సర్దుకున్నాను. క్రింద లలిత ఏవో చదువుకుంటున్నది. నన్ను చూచి ఆశ్చర్యాన్ని ప్రకటించింది.

"కాసినిమంచినీళ్ళిస్తావా" ఎండిపోయిన గొంతుతో అడిగాను. మంచినీళ్ళు త్రాగుతుంటే!.......

"ఏమిటి బావా యిది....?"

"మీ అక్కనే అడుగు" .... వచ్చేశాను.

తరువాత చాల రోజులు ఆలోచించాను అవిడను అర్ధంచేసుకోటానికి. కాని ఏ నిర్ణయానికి రాలేకపోయాను. ఈవిధంగాకూడ అనిపించింది–ఆమె ఎవరినైనా ప్రేమించి వివాహమాడుతానంటే, ఆమెతల్లిదండ్రులు సమ్మతించ లేదేమో!? .... అటువంటి పరిస్థితులలో అమే ఈ వివాహాన్ని ఎందుకని ప్రోత్సహించిందో అర్ధంకాదు. విషయము యేదయినా, యిందులో నాతప్పు యేమీ లేదు.

* * *

"ఇంకా ఎంతసేపు కూర్చుంటారు?"— ఈ లోకములోకి వచ్చాను. "అంతా వెళ్లిపోయారు వస్తారా....ఇక పోదాం" అంది మళ్ళీ. గడియారం ఆరు కొట్టింది. కాస్త సిగ్గుపడ్డాను, కుర్చీలో కూర్చుని, ఈ

లోకంతోసంబంధలేకుండా మూడుగంటలు ఎలా గడిపానా అని. "ఉండండి! ఇప్పుడే మొహం కడుక్కువసాను" అని బాత్‌రూమ్ వెళ్ళాను.

ఇద్దరమూ బయలుదేరాము. దారిలో అడిగింది "మీాశ్రీమతి కులాసా" అని.

"రాత్రికి వస్తున్నది. యిక్కడే పురుడు పోసుకుంటుంది."

"ఏం! భయపడుతున్నారా?"

"ఎబ్బే! దీన్నిగురించి కాదు. భవిష్యత్తును గురించి"

"అంత దీర్ఘంగా ఆలోచించేది ప్రస్తుతాన్నిగురించి కాదన్నమాట" — తేలిగ్గా నవ్వినట్లనిపించింది.

"మీాకు తెలియదు శారద! నిత్యజీవితములో మనకు అర్థముకాని విషయాలు అనేకం వున్నాయి!"

"క్షమించండి! యింత బాధపడుతున్నారని తెలియదు!"

కాసేపు ఎవ్వరం మాట్లాడలేదు. ఫాన్సీ షాపుకు వెళ్ళి ఒకబిస్కట్‌పాకెట్ తెచ్చింది.

"పచ్చినవారు ఎటుతిరిగి ఇంతదూరం వచ్చారు. మా యింటికి రండి, చూచివెళ్లుదురుగాని"

"మీావాళ్ళు ఏమయినా అనుకుంటే ?

"మీాకా సందేహం అక్కరలేదు. అలా అనుకునేవాళ్ళు మాయింట్లో ఎవ్వరూలేరు.

అదొక పెద్దభవంతి. మోడరన్‌ఫాషన్ లోనే వుంది. ముందు పెద్దపూలతోట. అనేక రకాల మొక్కలు చల్లటిగాలి.

"అత్తయ్య వచ్చింది అత్తయ్యవచ్చింది". అంటూ ఎక్కడనుంచో బిలబిలమంటూ పరుగెత్తుకువచ్చారు పిల్లలు. అందరకూ తలా ఒక బిస్కట్ యిచ్చిపంపింది.

"చూచారా! యిక్కడే ఎంతమంది అల్లుళ్ళు, కోడళ్ళు వున్నారో" అన్నది. ఇంతకీ కొడుకులూ కూతుళ్లే తక్కువంటారా"

చిన్నగా నవ్వింది.

"ఇక్కడే కూర్చోండి! యిప్పుడే వస్తా" నని వెళ్ళినది. సోఫాలో కూర్చున్నాను. కాసేపు పత్రికలు తిరగేశాను. "అలా వెళదాముగండి" అంది. గేటుదగ్గర కారాగింది. 'షికారుకు వెళ్తున్నావా తల్లీ' అని అప్యాయంగా పలుకరించారు, శారద తండ్రి అనుకుంటాను. పరిచయంచేసింది. 'మళ్ళా ఎప్పుడన్నా రమ్మని అహ్వానించారు. కారు కావాలంటే తీసుకొనివెళ్లమన్నారు, వద్దంది శారద.

"చూస్తే మీాకు ఉద్యోగంచెయ్యాల్సిన అవసరం లేదనిపిస్తున్నది"

"అవును మా నాన్నగారు రైల్వే యింజనీరు. ఈమధ్యనే రిటైర్ అయ్యారు, మా పెద్దఅన్నయ్య డాక్టరు. ఇంకో అన్నయ్య మద్రాసు కంపెనీలో జనరల్ మేనేజర్. అతని తరువాత అతను విదేశాంగశాఖలో శెక్రటరీ. నాముందు అతను వాల్టేరులో రీసెర్చిచేస్తున్నాడు. నా తరువాత అతను అనర్సు చదువుతున్నాడు. నేను ఒక్కతనే ఆడపిల్ల. నన్నూ అందరితోపాటే చదివించారు. కాలేజీ అలవాటుకదండి. పిల్లలందరూ బళ్ళోకి వెళ్తారు. మధ్యాహ్నం యింట్లో కూర్చుంటే యేమీా తోచదండి! ఏదో కాలక్షేపంకోసం యిక్కడ చేరా."

"ఇలా ఎంతకాలంచేస్తారు. మరి పెళ్లయిన తరువాత."

"వారిష్టం"

"చాల అదృష్టవంతులు"

"ఎవరు?"

సమాధానముగా నవ్వాను.

శారద కొద్దిగా సిగ్గుపడుతూ 'భలేవారండీ!' అనింది. సినిమాకు దారితీసినది. నేను రానన్నాను. టిక్కెట్లు మధ్యాహ్నము తెప్పించాను. 'ఎడ్డీ డిచ్చిన్ స్టోరీ'

"నేను రాలేను శారదా"

"మంచి పిక్చరండీ! కాస్త రిలీఫ్"

"క్షమించండి ! నన్ను బలవంతము చేయకండి!"

చెయ్యిపట్టుకుంటూ 'రాకపోతే వదిలేదిలేదు' అని లాక్కెళ్ళింది.

* * *

అతర్వాత నేను రాజ్యలక్ష్మివద్దకు వెళ్లలేదు. ఉత్తరంకూడ వ్రాయలేదు. ఆమె వ్రాయలేదు. కాని. మామగారు వ్రాశారు. 'నీవు కోరిన కోర్కెలు ఏపాటివి నాయనా! అంతమాత్రందానికి ఈవిధముగా ప్రవర్తించటము తగునా' అవి మందలిస్తూ. నేను ఏమేమి కోర్కెలు కోరుకున్నానో, అవి వాళ్లకు ఎప్పుడు వెల్లడించానో నాకు తెలియదు. నేను అలిగివెళ్లిపోయానని అవిడే కల్పించి చెప్పివుంటుంది. నేను దీనికి కూడా సమాధానము యివ్వలేదు. చివరకు అయనే వచ్చారు పండుగకు తీసుకొనివెళ్లటానికి కాదనలేకపోయాను.

నేను ముభావంగానే వున్నాను. ఆరోజు సాయంత్రము 'మల్లెపూలు తీసుకువస్తారా' అని అడిగినది రాజ్యలక్ష్మి. పొట్లంలలితకిస్తూ 'రాజ్యలక్ష్మి కావాలంది' అన్నాను మెట్లుదిగుతూ 'అక్కయ్యపిలుస్తున్నది పైకి వెళ్ళు' అంది లలిత.

రాజ్యలక్ష్మి అద్దముముందు కూర్చుని చెండుకట్టున్నది. త్రాచుపాముల్లా రెండు జడలు నేలమీాద నాట్యము చేస్తున్నాయి.

కుర్చీలో కూర్చున్నాను. అద్దములోనుంచే పలుకరించినది, 'హీరోకు కోపమువచ్చినట్లున్నదే' అని. నేను మాట్లాడలేదు.

పూలచెండు తల్లోపెట్టుకుంటూ ఛూచి నవ్వి గడ్డంపుచ్చుకొని 'సినిమాకు వెళ్దాం కొంత టాయ్‌లెట్ అవండి' అంది.

లలితనుకూడ తీసుకొనివచ్చింది. సినిమాలో అవిడ నాప్రక్కకూర్చోలేదు. మధ్య లలితనే కూర్చోబెట్టింది. సినిమా అయిపోయింతరువాత బయటకువచ్చాం. నాకు కొద్దిగా బద్ధకంగా వున్నది. కాస్త తలనొప్పిగాకూడ వున్నది. అవిడ నడచివెళ్దామన్నది. పైన మబ్బులు, చల్లగాలి. నేను రిక్షాలో వెళ్దామన్నాను. అవిడ వద్దంది. బ్రతిమాలుతున్నధోరణిలో 'నాకు జ్వరము వచ్చేటట్లున్నది. నా మాట విను రాజ్యం' అని చెయ్యిపట్టుకున్నాను.

"యు రాస్కెల్ .... ఎంత ధైర్యము?" అంతే నలుగురుచేరారు. నాకు నోటమాట రాలేదు.

లలిత నిశ్చేష్టురాలైనది.

"చదువుకున్నవాడివి జ్ఞానం అలవరచుకోనక్కర్లా! ఇదివర్లో ఒకసారి క్షమించి వదిలేశాను జ్ఞాపకములేదూ!" అని నన్ను జనానికి వదిలేసింది.

"చూస్తారేమిత్రా, రెండులాగక" అన్నాడెవడో. ఇక అక్కడ ఉండటం మంచిది గాదని సందుచేసుకొని పరుగెత్తాను వెనక. మరింకొకడెవడో 'కాస్త విచక్షణా జ్ఞానం కావాలి గురూ! చందమామకొరకు చేతులు జాపటం అవివేకం' అంటున్నాడు. అక్కడ జేరినవారు కాస్త దయగలవారై వుండాలి, నావెంట యెవరూ పడలేదు. చాల దూరం వచ్చేశాను. వర్షముగూడ కొద్దిగా సాగింది. ఒకచెట్టుక్రింద నుంచున్నాను. ఏం చేయటానికి తోచలేదు. వళ్లు వేడెక్కింది తలనొప్పి ఎక్కువయింది.

* * *

గప్పున లైట్లు వెలిగాయి.

"సినిమా చూస్తున్నారా...." అని శారద అడిగింది.

"తలనొప్పిగా వుంది"

"ఇదిగో అస్ప్రోబిళ్ళ వేసుకోండి కాఫీకి ఆర్డరిచ్చాను వస్తుంది.

* * *

చప్పున గుర్తుకు వచ్చింది, యిప్పుడే రైలు ఉన్నదని. వర్షము ధారాపాతముగా కురుస్తున్నది. కనుచూపుమేరలో ఒక్క రిక్షాకూడ లేదు. నడకసాగించాను. దురదృష్టవంతులకు ప్రకృతిసైతము ఎదురు తిరుగుతుంది.

టికెట్‌తీసుకున్నాను రైలురెండుగంటలు లేటు. చేసేదిలేక ప్లాట్‌ఫారంమీద ఒక మూల బెంచీపై కూలబడ్డాను. చలిగాలి ఎముకలు కొరుక్కుతింటున్నది. అలాగే వత్తిగిలి పడుకున్నాను.

"బావా....బావా!...." లలితపిలిచినట్లని పించినది. లేచి చూచాను. ఆమె రెండు సూట్ కేసులు బెడ్డింగులతో వచ్చింది.

"నేనే బావా! లే వెయిటింగురూములో గుడ్డలు మార్చుకుందువు గాని, నీకోసము తీసుకువచ్చాను"

"కట్టుకున్న భార్యకే లేనిది నీకెందు కింత శ్రమ. నేను యీవిధముగా నలుగురిలో అవమానవడటమే ఆవిడ అభీష్ట మయితే ఆవిధంగానే కాని."

"వాతావరణం చూడు బావా!"

"మనసే ఒక తుఫానులో చిక్కుకున్నది శరీరం యీ గాలివానను భరించలేకపోదు లలితా!"

"నామాటవిను. అసలే జ్వరంవచ్చింది అందులో తడిబట్టలు చాల ప్రమాదకరం"

"గౌరవము పోయినతరువాత నేను చస్తే మాత్రమేమిటి! మీ అక్కయ్య సుఖపడుతుంది"

"ఛ! అవేంమాటలు చాల తప్పు"

"లలితా! నీకు నా ముఖం చూపించ లేకుండ వున్నాను. వచ్చినదారిన వెళ్లనిస్తే నాకు మేలుచేసినదానవవుతావు"

"నిజముగా అవమానముతో కృంగి కృశించాల్సింది మేముగాని నీవు గాదు. నీకు జరిగిన అవమానము ప్రపంచములో ఏ భర్తకు జరిగివుండదు. ఏమయినా యీ పరిస్థితిలో నిన్ను వదలి వెళ్ళదలచుకో లేదు. నేను నీతో వస్తున్నాను"

"వద్దులలితా! మీఅక్కయ్య ఆగ్రహానికి గురికాబోకు. ఆవిడ ఎందుకయినా సమర్థురాలు నన్ను నాకర్మకు వదిలేయి"

ఇంతలో రైలు వచ్చింది.

పెట్టెలో మేమిద్దరంతప్ప ఎవ్వరూలేరు. గుడ్డలు మార్చింది. బర్తుపై బెడ్డింగుపరచి పడుకోబెట్టి దుప్పటికప్పినది. ఫ్లాస్కులో కాఫీ కప్పులోపోస్తుంటే అన్నాను: 'నన్ను క్షమించు లలితా! అనవసరముగా నీకు శ్రమయిస్తున్నాను' అని.

నాముఖాన్ని చేతుల్లోకితీసుకొని 'ముద్దువచ్చే యీ ముఖాన్ని చీదరించుకోటానికి ఎంత కఠినమయిన హృదయం కావాలి?'

"వద్దు లలితా! నైతికంగా ఎన్నడూ దిగజారలేదు. ఈ జన్మలో ఆ అదృష్టంలేదు. అప్సరసలాంటి భార్యచెయ్యిపట్టుకోడానికే అర్హతలేని నాకు ఆ కోర్కెలు కూడానా? ఛీ....నా జీవితము ఎందుకా అని అనిపిస్తున్నది."

* * *

"చూచారా హీరో ఎంత బాధపడుతున్నాడో!" శారదమాటలు.

"హెూరున వీచే వానగాలిలో, భయంకరముగా ప్రవహించే అనదివొడ్డున ఒంటరిగా నిలబడి భవిష్యత్తును గురించి ఆలోచిస్తున్నాడు"

ఇక కూర్చోలేక బయటకు వచ్చాను. వెన్నలగా వున్నది. శారదవచ్చి "రండి! అయిపోవచ్చింది" అంటూ లాక్కెళ్లింది.

సినిమా అయిపోయింది. మెట్లు దిగుతుంటే 'కారువచ్చింది భోజనంచేసివెళ్లుదురుగాని రండి' అంది. వద్దన్నాను కాని బలవంతముచేసి, భోజనము అయినతర్వాతనే నన్ను వదిలిపెట్టింది.

* * *

లలితతో వచ్చిన మర్నాడే రాజ్యలక్ష్మి వచ్చేసింది. వచ్చీరాగానే ఆవిడ వేసిన ప్రశ్న — "లలితతో హాయిగా కులుకుదామనుకున్నారేమో! అవేమీ సాగవు.

దానికి సమాధానము లలితే యిచ్చింది.

"నూట ఏడు డిగ్రీల జ్వరంతోవున్న భర్తతో మాటలాడుతున్నావని తెలుసుకొనే స్థితిలో ఉన్నావా....లేవా?...."

"నేను ఏస్థితిలోవున్నా నీవుమాత్రము యీస్థితిలో ఒక్కక్షణం యిక్కడ ఉండటానికి వీలులేదు. రాత్రిబండికి ప్రయాణము కట్టు"

ఓపికచేసుకొని 'యింటికివచ్చిన చెల్లెలకు యివ్వవలసిన మర్యాదేనా యిది' అన్నాను.

"మీకు తెలియదు ఊరుకోండి" అంది.

"అక్కా! నీవు నాకు మర్యాదచేసినా, చేయకపోయినా, నేనుమాత్రము బావను ఈ పరిస్థితిలో వదలి వెళ్ళదలచుకోలేదు"

తరువాత వారిద్దరిమధ్య మాట మాట పెరిగింది. పర్యవసానంగా లలిత ఆ రాత్రికే ప్రయాణమయింది.

వెళ్లేముందు నా దగ్గరకువచ్చి కన్నీరు కారుస్తు 'బావా! అన్నిటికీ పైన ఆ భగవంతుడేవున్నాడు' అని శలవు తీసుకుంది.

తర్వాత రాజ్యలక్ష్మి మందుయిస్తూ అన్నది: 'యిది విషము అని అనుకునేరు. మీరు ఆరోగ్యముగా ఉంటేనే నా నాటకమూ, మా విమోచనమూనూ.'

ఆమె చేసిన సేవఫలితముగా జ్వరము వారం, పది రోజులలో నెమ్మళించింది.

నా పనులేవో నేను చూచుకొని వెళ్ళిపోయేవాడ్ని. భోజనము హెూటల్‌నుంచి వచ్చేది. పిలయినంతవరకు ఆవిడతో పని కల్పించుకొనేవాడ్నికాదు. ఒక్కొక్కరోజు చూచేవాడ్నికూడ గాదు. లోకందృష్టిలో మేము భార్యా భర్తలము. ఇంట్లోమాత్రం మా యిద్దరిమధ్య పెద్ద అగాధం. ఈ విధముగా రెండు నెలలు గడచాయి.

ఆఫీసుకు వెళ్లబోతుంటే ఒకరోజు హటాత్తుగా దర్శనమిచ్చి—"సాయంత్రం వచ్చేటప్పుడు మల్లెపూలు తీసుకురండి!"

"మల్లెపూలా....!"

"ఊఁ....సినిమాకు వెళ్దాం" గారాబంగా అంది.

"నేను రాను. నాకు వేరే పనివుంది. కావాలంటే నీవు వెళ్ళు" అని బయలుదేర బోయాను.

"అంత కోపమయితే ఎలాగండి! మీకు నమ్మకంలేదా" అని నా చేతిని తనచేతిలోకితీసుకొని 'ఇలా నడ్డాగావెళ్దాం" అంది.

నేను మాటలాడలేదు.

"వస్తారు గదూ" ఎదురుగా నిలబడి నన్ను ముద్దుపెట్టుకొని—"ఇక సరేనా...."

"ఈ జన్మలో నీవెంట సినిమాకురాను" విదలించుకోబోయాను కాని, నా మెడకు ఆమెచేతులు పెనవేస్తు 'మీరు రాకపోతే నామీద ఒట్టే' — బుంగమూతి పెట్టింది. ఎర్రటిపెదాలు ఆహ్వానిస్తున్నాయి. వేరే గులాబీలు ఎందుకా అని అనిపించింది. కాని ధైర్యం చేయలేకపోయాను.

మాటయితే యిచ్చాను. తీరా వెళ్లబుద్ధి కాలేదు. రాజ్యలక్ష్మి ఆఫీసుకువచ్చి తీసుకొనివెళ్లింది. ఇద్దరం యింటిదగ్గర టిఫిన్ తీసుకున్నాం. తల్లో పూలచెండు పెట్టుకుంటూ 'మీరు తీసుకురారని తెలుసు! యింటిదగ్గరే కొన్నాను' అంది.

రిక్షాచేసుకొనివెళ్ళాం. సినిమా జరుగుతున్నంతసేపు నా చేతి ని తనచేతిలోనే ఉంచుకుంది. ఇంటికి వచ్చాం. ఆకలి లేక వెళ్ళిపడుకున్నాను.

"భోజనానికి లేస్తారా...."

"చేయాలనిలేదు"

"ఏమిటండీ చిన్నపిల్లల్లాగ" అంటూ నన్ను బాత్‌రూమ్‌లోకి తీసుకువెళ్లి, కాళ్ళు చేతులుకడిగి, నబ్బుతో మొహంతోమింది. తుండుగుడ్డతో నా మొహాన్ని తుడుస్తూ—

"ఏమిటి చూస్తున్నావ్" అని అడిగాను.

"మీముఖం చాల ముద్దువస్తున్నదండీ" దగ్గరకు లాక్కోబోయాను.

"అంత తొందరెందుకండీ...."

పీటవేసి విస్తరపరచి వడ్డిస్తూ—

"స్వయంపాకం నోట్లో వేసుకుంటే స్వర్గములో విహరిస్తున్నట్లుండాలి, ఏమనుకున్నారో!"

"మళ్ళీ తిరిగివస్తానా" తమాషాగా అడిగాను. కోపంగాచూచి మళ్ళీ నవ్వేసింది. ప్రక్కన విసురుతూ కూర్చుంది.

"ఏం ఫాన్‌వేయలేకపోయావా?"

"ఆఁ! యిందులోవున్న ఆనందము అందులో ఎక్కడున్నదండీ...."

పీటమీద కూర్చున్నానుగాని నిజంగానే ఆకలిలేదు చెప్పేశాను.

"ఏమండోయ్! మీరు మొండి అయితే నేను శతమొండిని. మిమ్మల్ని యివాళ వదిలిపెట్టేదిలేదు. ముద్దలుకలిపి నోట్లో పెట్టాగాని చిట్టితండ్రి కానీ"

మజ్జిగ పోస్తుంటే....

"ఏమిటండీ చంటిపిల్లలావదిలయిండ"

"ఒక్కముద్దు...."

చప్పున లాక్కుంది.

"ఇవాళ పౌర్ణమిగదుటండీ! మంచాలు దొడ్లో వేశా" నంది.

పిండారపోసినట్లు వెన్నెలకురుస్తున్నది. తెల్లటిపక్కపై వయ్యారంగా పడుకుంది.

"వెన్నెల చాల బాగుంది గదండీ" అని ముద్దుగా అడిగింది.

"ఏంపిల్లా! ఉషార్‌గాఉన్నావ్! ఏమిటి విశేషము?"

పిల్చింది వెళ్ళి మంచముమీద కూర్చున్నాను. కిలకిలా నవ్వింది కళ్ళు తియ్యగా మాట్లాడుతున్నాయి. అనుకోకుండా ముద్దుపెట్టుకోబోయాను.

వచ్చి నామంచంమీదపడ్డాను. 'ఇదిగో మూడవ వార్నింగ్. మళ్లీ జన్మలో ప్రయత్నించవద్దు' అవిడ నవ్వుతూనేవుంది.

"ఇంత అందమైన భార్యను కేవలము చూచి ఆనందించవలసినదేనా" అని అనిపించింది. ఆమెకళ్ళు చిలిపిగా ఆహ్వానిస్తున్నాయి. 'ఇంత వెన్నెల వృదాపరచవలసిందేనా' — ఆమె నిండుగా నవ్వుతూనేవుంది. ప్రొద్దున పదిగంటలకు మొదలుపెట్టిన నాటకానికిది ముగింపన్నమాట!

నాహృదయము అవమానముతో కృంగిపోయి నారక్తము ఉడికిపోయింది. నా భార్యపై నాకుగల సర్వహక్కులను వినియోగించదలచుకున్నాను.

అకాశంలో చంద్రుడు మబ్బులచాటున పరుగెత్తుతున్నాడు. బంగారాన్ని సైతము తృణీకరించగల ఆమె శరీరచ్ఛాయ నన్ను ఉత్తేజపరచింది. తలలోని మల్లెలవాసన నాకు మత్తెక్కించింది. 'చూడు! ఎంత బిగువుగా బంధించిందో' అని అన్నట్లున్నాయి ఆమె వక్షోజాలు.

ఆమె ఇంకా చిలిపిగా చూస్తూ నవ్వుతూ 'పాపం' అంది.

అంతే! మరుక్షణంలో ఆమె జాకెట్ చినిగిపోయింది. ఆమె శతవిధాల పెనుగులాడింది. గిచ్చింది .... రక్కింది .... కొరికింది....కాని చివరకు ఓడిపోయింది. నా బాహువులలోకి నిండుగా తీసుకొని నాలో చేర్చుకున్నాను.

చేసేదిలేక ఏడుస్తు కూర్చుంది.

"నీకు ఏడవటంగూడ వచ్చన్నమాట" వెటకారంగాఅన్నాను. ఆమె మాట్లాడలేదు.

"మానభంగము జరిగిందని మొరపెట్టుకోటానికి యిక్కడ ఎవ్వరూ లేరల్లే వుంది. రోడ్డుమీద జనాన్ని పిలవనా?"

లేచి గబగబా వెళ్లిపోయి గుమ్మందగ్గర వెనక్కుతిరిగి 'రేపు ప్రొద్దునకు నామొఖం మీకు కనిపించదు' అని ధబాల్‌మని తలుపుతీసుకుంది.

"చస్తేచావు నీచెల్లెల్ని చేసుకుని హాయిగా వుంటాను."

ఇంతలో తలుపులు తెరచుకోవటం, నా తలమీద బరువయినదేదో పడటంవరకు లీలగా జ్ఞాపకంవుంది.

ప్రొద్దున రాజ్యలక్ష్మి కనుపించలేదు. రెండురోజుల తరువాత లలిత ఉత్తరము వ్రాసింది, అక్కడకు వచ్చిందని. మరో రెండు నెలలకు తెలిసింది, రాజ్యలక్ష్మి గర్భిణీ అని. మంచిపని జరిగిందనుకున్నాను. ఇంతలో రాజ్యలక్ష్మి తన అభిప్రాయాన్ని స్పష్టపరచింది, నన్ను ఏవిధముగా గౌరవించిందో నా శిశువునుగూడ అదేవిధముగా గౌరవిస్తుందిట.

* * *

నేను స్టేషనుకు వెళ్ళకపోయినా రాజ్యలక్ష్మి వచ్చేసింది, వచ్చినవెంటనే—

"మీరు చేసిన పాపానికి ఫలితాన్నివ్వటానికే వచ్చాను"

"ఎంత అనర్ఘ్యప్రాడ్యుయేటయినా, నీవు కేవలం ఒక స్త్రీవని, నా భార్యవని తెలునుకున్నావనుకుంటాను!"

"ఆఁ....ఆఁ.... ముందుముందు మీకూ తెలుస్తుంది"

మర్నాడు సాయంత్రము ఆఫీసులో "మీయింటికి 'టీ'కి వస్తున్నానండోయ్" అంది శారద.

"ఏం? మీకు బాకీ తీర్చాలా...."

"అసలేకాదు....వడ్డీకూడ కావాలి"

శారదను పరిచయంచేస్తే నవ్వుతూ ఆహ్వానించింది రాజ్యలక్ష్మి. కూర్చోబెట్టి చాల విషయాలు మాట్లాడింది. చివరకు తన నజ్జుక్తు వేదాంతముగురించి ఉపన్యసించిందికూడా.

బిస్కట్లుపెట్టింది 'టీ' త్రాగుతుంటే—

ఎలా వుంది టీ—

శారద ఉన్నది కాబట్టి వదిలేశాను లేకపోతే నీ పెదాలకు మంచి పనిష్మెంటు యిచ్చేవాడ్ని.

ఆఁ....ఆఁ .... యిలాంటి కొంటెవారితో ఎలా నెట్టుకొస్తున్నారండీ ఆఫీసులో?

మీవారు కొంటెవారేకాదు. పసిపిల్లలకుమల్లె మారాంచేస్తారుకూడ—

నన్నేనని అనుకున్నా! మిమ్మల్ని గూడ తిప్పలు పెట్టున్నారన్నమాట. ఈ మగవాళ్ళందరూ ఒకేజాతి కదండీ! అడదికని పిస్తేచాలు ఇంక బయలుదేరుతాయి. ఇవతలవాళ్ళు చస్తున్నా కనికరించరు.

కాసేపు ఇంకా ఏవేవోమాట్లాడుకున్నారు 'ఇల్లు అదీ చూపిస్తాగాని మీరు బజారుకు వెళ్ళి ఒక జాకెట్‌గుడ్డ, పళ్ళు అవీ తీసుకొని రమ్మని హుకుంజారీ చేసింది.

పళ్ళు పుచ్చుకుంటూ—

పళ్ళు యివ్వంగనే సరికాదు. పండులాంటి పిల్లవాడ్ని కనాలి అంది శారద.

పిల్లవాడు పుట్టితే నేనే గెలిచినట్లు అని నావంక గర్వముగా చూచింది.

ఏం! మీ భార్యాభర్తలు పందాలు వేసుకున్నారా ఏమిటి?

అంత అమాయకులుగా కనిపిస్తున్నారని అనుకుంటున్నారేమో! భలే గడుగ్గాయిలు గదుటండీ?....

మీరు మీ భార్యనుచూచి భయపడుతున్నారో లేక ఆమె మిమ్మల్నిచూచి భయపడుతుందో నాకు అర్థంకాలేదని, రిక్షా ఎక్కుతూ శారద అంది. నవ్వి ఊరుకున్నాను.

రాత్రికి రాజ్యలక్ష్మికి నొప్పులు తగిలాయి. అసుపత్రిలో చేరనంది. ప్రక్కవారి సాయంతో తెల్లవారుజామున పురుడు వచ్చింది. మగపిల్లవాడు.

అందరూ కంగ్రాట్యులేట్‌చేశారు. అకౌంటెంటు అప్పుడే జాతకముకూడ వేసి చాల అదృష్టవంతుడోయ్! కాని ఎందుకయినా మంచిది. కొద్దిగా జపం అదీ చేయించు అని సలహా యిచ్చారు.

మీకు జాతకాల్లో నమ్మకముందా అని శారద అడిగింది.

ఇదివరకు వుండేది కాని, పెళ్ళయిన తరువాత పోయింది....మరి మీకు....?

నాకూ పెళ్ళయిన తరువాత పోతుందంటారా అని నవ్వింది.

పిల్లవాడ్ని చూచివచ్చి శారద అన్నది:

అచ్చంగా వాళ్ళ తల్లి పోలికే నండి! గుండ్రటిమొఖం, ఆ రంగు, ఆ కళ్ళు, ఆ బుగ్గలు....దొండపండులా వున్నాడు.

అంతబాగుంటే మీరే పెంచుకోరాదూ?

(! అలా అంటారుగాని, నిజముగా యివ్వఘనేటప్పటికి తెలుస్తుంది.

ఎవ్వరకు కబురుచేయనీయలేదు రాజ్యలక్ష్మి. పదకొండోరోజు క్లుప్తముగా బారసాలచేసుకున్నాము.

కష్టాలు గడిచాయని ఎన్నడూ సంతోషించటానికి వీలులేదు. అసలు జీవితమంటేనే కష్టమయమేమోనని అనిపిస్తుంది. రాజ్యలక్ష్మి అన్నమాటలు సుర్తుకువచ్చి భయపడ్డాను. అలాగే జరిగిందికూడ. ఒకరోజు అర్ధరాత్రి పిల్లవాడు గుక్కలుపెట్టి యేడుస్తుంటే లేచాను.

అలా ఊరికనే కూర్చోకపోతే కాసిని పాలు యివ్వరాదూ ?

పాలా....! మీరు మరచిపోయారేమో, నాకు బాగా జ్ఞాపకం. ఇదిగో ఒకవిషయం మాత్రము తెలుసుకోండి. నాలో పాలు ఉబికి, కారి, పారి, పొంగి పొరలి వెల్లువలై ప్రవహించినాకూడ, మీ బిడ్డకు ఒక బొట్టయినా దక్కనివ్వను.

వీడు నాకేగాని నీకేమీ కాడా ?

ఏదో పెద్ద ఘనకార్యంచేశారని సంతోషించారేమో ? చూస్తున్నారుగదా ! అలా యేడ్చి, యేడ్చి, గొంతుఎండి, సోషవచ్చి, సొమ్మసిల్లిపోతుంటే, ఏమీచేయలేక లోలోపల కుములుతూ, కుములుతూ మీరు చిత్రవధకు గురికావటమే నా కోరిక.

రాజ్యలక్ష్మి ! నేనేం ద్రోహముచేశానని మామీద నీకెందుకింత పగ! తెలిసి నేనేమి తప్పుచేయలేదు. తెలియక చేసిందేమన్నా వుంటే నన్ను క్షమించు పిల్లవాడికిమాత్రం అన్యాయము చేయమాక. ఇదే నిన్నువేడుకుంటున్నానని ఆమెచేతులుపట్టుకున్నాను.

"ఛీ! ఎన్నిసార్లు చెప్పాలి?"

చివరనువిసిగి—

రాజ్యం! నీవు స్త్రీవి. నీకు భర్త పిల్లలు కావాలి. ఆ నగ్నసత్యం నీకు యీనాడు తెలియకపోయినా ఏనాటికైనా తెలుస్తుంది. ఇంకా ఏదో చెప్పబోయాను. కాని యేమీ విన్పించుకోకుండా 'నేను వెళ్లిపోతున్నాను నన్ను కలుసుకోటానికి ఎన్నడూ ప్రయత్నించవద్దు.'

వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

ప్రపంచము గొడ్డుపోలేదు. విషయము తెలుసుకొని శారదతండ్రి 'కష్టాలు కలకాలం ఉంటాయా నాయనా! ఏదో ఉడుకు రక్తం....అంతే. ఈలోగా మా యింట్లోనే పెరగనీ, మాయింటినిండా పిల్లలే! చూస్తున్నావుకదా! వాళ్లతోపాటే వీడూనూ' అని. కృతజ్ఞత తెలుపుకున్నాను.

మూడోనాడు ఉత్తరంవచ్చింది. మామగారు వ్రాశారు. 'విచారపడకు! ఏంచేస్తాం నీవు రాజ్యలక్ష్మి కులాసాగావుండాలి గాని పిల్లలకేం కొదవ....' ఉత్తరంచూచి శారద అన్నది: 'ఈవిడ తల్లేనా?....రాక్షసా....?'

రాక్షసే నయం! పిల్లలకు పాలిచ్చుకుంటుంది ప్రేమతో పెంచుకుంటుంది.

ఊరుకోండి! మీలో తప్పులేనప్పుడు మీరెందుకు బాధపడటం. పిల్లవాడ్ని గురించి మీకేచింతా అక్కరలేదు. నా చేతుల్లో పెంచుతానని మాటయిస్తున్నాను. మీరు నిశ్చింతగా ఉండండి !

ఆఫీసు పనిమీద కలకత్తావెళ్ళి, పని పూర్తిచేసుకొని తిరిగివస్తుంటే విశాఖపట్ణంలో మామగారు కలిశారు. దారిలో ఏవేవో విషయాలు మాట్లాడాము. చివరకు 'ఏమోయ్! అమ్మాయికి నీకు అభిప్రాయభేదాలు వచ్చాయా యేమిటి! వచ్చి ఆరు నెలలయిన యిద్దరిమధ్య ఉత్తరాలు లేవు' అని అడిగారు. సూట్‌కేసులోనుంచి ఫోటో తీసి చూపిస్తూ 'మీ మనుమడు హాయిగా అక్కడే పెరుగుతున్నాడు. మరి మీరేమి అనుకుంటున్నారో'' అన్నాను. కాసేపటికి తెప్పరిల్లి 'నేను చాల విచారిస్తున్నాను. నా కూతురు ఇంత అసహ్యంగాను. అమానుషంగాను ప్రవర్తిస్తుందని నాకు తెలీదు.

మీకు తెలియని విషయాలు చాల ఉన్నాయండి మామగారు: మా యిద్దరిలో ఎవరికో ఒకరికి సిగ్గువుండాలి. ఆ వంతు నేనే వుచ్చుకోవాల్సివచ్చింది.

ఆయనకు కోపంవచ్చింది. సంగతంతా తేలుస్తానన్నారు. అవకాశంలేదన్నా దిగమని బలవంతముచేసి తీసుకెళ్ళారు. మా యిద్దర్నీ చూచినవెంటనే రాజ్యలక్ష్మి.

పాపం! ఫిర్యాదుచేసుకోటానికొచ్చారా! ఇటువంటివాటికి నేను ఏమీ లొంగేదాన్నిగాదు. ఈ జన్మలో మీ ముఖం చూడను అని వెనక్కుతిరిగి వెళ్ళబోయింది.

మామగారు ఉగ్రరూపందాల్చి, ఫోటో మీదకు విసురుతూ 'ఈ పిల్లవానికి నీకూ ఏమీ సంబంధంలేదా?' గట్టిగా అరిచారు.

అంతకంటె విసురుగా లోపలకు వెళ్ళివచ్చి, ఒక ఫోటో నామీదకు విసరేసి 'ఆ ఫోటో ఎవరిదో చెప్పమనండి!'

ఫోటో తీసుకొని చూస్తున్నాను

ఆడదంటే ఆటబొమ్మగాదు. నమ్మించి ద్రోహముచేయటానికి!

ఏమిటి నీవు మాట్లాడేది ?

ఏమున్నది! మీ అల్లుడుగారు చేసిన ఘనకార్యంగురించి. అభంశుభం ఎరుగని అమ్మాయిని నమ్మించి గొంతుకోశారు. అవమానం భరించలేక అయిదునెలల గర్భముతో ఆత్మహత్య చేసుకున్నది. చివరి ఘడియల్లో ప్రక్కనేవున్నాను. ఆ దారుణ సంఘటన చూస్తున్నప్పుడు నాకు మగజాతిపై ద్వేషంపుట్టింది. ఆమె మృత్యువుతో పెనుగులాడటం చూస్తూ, ఆ నిండు ప్రాణాలను అన్యాయముగా బలిగొన్న వానిపై పగసాధించుదా మనుకున్నాను. అతన్ని వివాహమాడి, ఆ సంసారజీవితం నరకమయం చెయ్యాలని దీక్షవహించాను అందుకనే కోరి వీరిని వరించి వివాహమాడాను.

కాసేపు నిశ్శబ్దముగా ఉన్నారందరూ.

అయితే నిన్ను నీవు పూర్తిగా మోసము చేసుకున్నావు. ఇంతకంటె వేరే ఆత్మవంచన అక్కర్లేదు. ఊరుపేరు ఒకటయినంతమాత్రాన మనుష్యు లొకటవుతారా ? ఇతనువేరు. ఈయన చదువంతా కలకత్తాలోనే గడచిపోయింది. అంతమాత్రము విచారించకుండా నీ గొంతుకు ఉరితగిలిస్తావా తల్లీ? తండ్రినయిన నన్నే నమ్మలేకపోయావే!!

నిజంగానా నాన్నా! వణుకుతున్నకంఠముతో అంది.

అవునుతల్లీ! అతను తరువాత మతిభ్రమించి దేశంమీదకు పోయాడు. ఈ మధ్యనే తిరిగివచ్చి రైలుక్రిందపడి ప్రాణాలు కోల్పోయాడు. క్రితంనెల పేపరులో పడ్డది నీవు చూడలేదా!

అంతే! ఏదో మాట్లాడిందిగాని ఏమీ వినపడలేదు. కాళ్ళక్రిందభూమి కదలినట్లనిపించిందో....లేక పైన పిడుగుపడినట్లయిందేమో .... ఆవిడ కుప్పగా కూలిపోయింది.

ఆరాత్రి ఎప్పటికోగాని స్పృహరాలేదు. ఏమీ మాటలాడలేదు అలాగే శూన్యములోకి చూస్తూపడుకున్నది. మంచు పుచ్చు

తినేదికాదు, కాఫీత్రాగేదికాదు. ఆఖరుకు పచ్చిమంచినీళ్ళుకూడ ముట్టుకునేదిగాదు. మూడురోజులు గడిచాయి. మరీ నీరసించి పోయింది. నేనుమాత్రము అవిడకు కని పించలేదు.

చొరవచేసుకుని పైకివెళ్ళాను ఒకసారి. రాజ్యలక్ష్మి అటువైపు తిరిగి పడుకొని వున్నది.

బావ వచ్చారని ప్రక్కన కూర్చున్న లలిత అన్నది.

నాకు తెలుసు అని బవాబిచ్చింది రాజ్య లక్ష్మి. లలిత క్రిందకు వెళ్ళిపోయింది. మంచంప్రక్కన కూర్చుని పిలచాను.

దయయుంచి మీరు క్రిందకు వెళ్ళండి! మీకు నాముఖం చూపించలేనని ప్రార్ధించి నట్లున్నది.

మందు అదీ పుచ్చుకుంటానని మాటిస్తే!

మీరు చెప్పారు కాబట్టి అలాగేచేస్తాను!

చెప్పినట్లు చెయ్యకపోతే పసిపిల్లలకు ఆముదంపోసినట్లు నీకు మందుపొయ్యాల్సి వుంటుంది!

మర్నాడు సాయంత్రము రాజ్యలక్ష్మి పిలుస్తే వెళ్ళాను. ఎదురుగా కూర్చున్నాను చాలసేపు మౌనంగానే గడిచింది.

నేనంటే కోపమా? నెమ్మదిగా అడిగింది.

లేదన్నాను.

నేను మీ కే మీ యివ్వలేకపోయాను. మిమ్మల్ని సుఖపెట్టలేకపోయాను. ఒక వేళ నేను మామూలుమనిషై మీదగ్గరకు వస్తే ప్రేమతో స్వీకరిస్తారా?

ఏమిటిరాజ్యం ఈ మాటలు. షండు లాంటి పిల్లవాడ్ని ప్రసాదించావుచాఅదూ! అయినా నీకేమితక్కువ చెప్పు. డబ్బుంది సౌందర్యంవుంది విద్య వుంది. సంగీత ములో ప్రావీణ్యాన్ని సంపాదించావు, నాట్యముచేయగలవు. నిన్ను ప్రేమించ లేకపోతే మరెవ్వర్ని ప్రేమించగలను చెప్పు....?

అన్నీ ఉన్నాయి కాని నాడబ్బు మిమ్ము లను మభ్యపరచింది. మిమ్ము మురిపింప చేసి, తనివితీర అనుభవింపనిచ్చి, స్వర్గ సుఖాలను అందించవలసిన ఈ అందము కేవలం మిమ్మల్ని ఊరించి కవ్వించటా నికే ఉపయోగించింది, చదివిన చదువు విశాలమయిన దృక్పధాన్ని అలవరచు కోటానికి ఉపయోగించకపోగా మిమ్మల్ని మోసవుచ్చటానికి పనికివచ్చింది. ఎంతో మందిని మైమరపింపజేసిన నా కంఠ మాధుర్యం మిమ్మల్ని దూషించుటకే విని యోగపడింది. మీరు ఎప్పుడో అన్నారు.

కాని నేను యీనాడు తెలుసుకున్నాను. నేను కేవలం ఒకస్త్రీ అని వెక్కి వెక్కి యేడ్వసాగింది.

ఛీ! ఎందుకేడుస్తావ్! కళ్లు తుడువ బోయాను.

నన్ను ముట్టుకోకండి! ఈదేహంవున్నది చూచారూ! ఎంతోమందిని మోహింపచేసిన యీ దేహం....ఇదంతా విషముతో నిండి వుందండీ. జాకెట్ తడిసిపోతున్నది. ఇదుగో! ప్రవహించే యీ పాలలో ప్రతి బిందువుకూడ కాలకూటవిషంతోసమానం. ఈచేయి దీన్ని గంగలో ఎన్ని వేల సార్లు ముంచితే పావనం అవుతుందంటారు? సప్తసముద్రాలలో మునిగినా యీ దేహానికి విమోచనము ఉంటుందంటారా....?

రాజ్యం జరిగిపోయిందేదో జరిగి పోయింది.

మిమ్మల్నెన్నో బాధలు పెట్టాను. క్షమించ మని అడగటానికైనా నోరు రావటంలేదు,

చేతులెత్తి ఒకసారి నమస్కరించి 'మీ రెంతో మంచివారు విశాలమయిన హృద యముగలవారు. జన్మజన్మాలకు మీరే నా భర్తగా దొరకాలని యిదే భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను' అంది.

ఏమండీ ఒకవేళ నేను కనుక చనిపోతే మీరుమాత్రం నా చెల్లెల్ని చేసుకోవద్దు. మిమ్మల్నీ సుఖపెట్టలేదు, అవిడ సుఖ పడలేదు!

ఛీ! అవేంమాటలు. వారం పది రోజు లలో ఆరోగ్యము చేకూరదూ! మళ్లీ మన ఊరు వెళ్ళిపోదాం. చిన్నబంగళా కొందా మనుకుంటున్నాను. హాయిగా మనం మన బాబు....!

ఇక ఆపండి! నేను పిల్లవాడ్ని ఏనాడో వదులుకున్నాను అక్కరలేదని. మళ్ళీ ఏ ముఖంతో దగ్గరకు వచ్చేది!

తెరలు విడిపోయాయిగదా! ఇంకా పట్టు దలలేమిటి. ఏమయినా వాడికి నీవు తల్లివి కావా! నాకు భార్యవు కావా??

ఈ జన్మలో అంత అదృష్టానికి నోచుకో లేదు. నన్ను క్షమించారు. ఆ సంతోష ముతో మీ పాదాలదగ్గర కళ్ళుమూస్తే అదే చాలు.

తరువాత ఎక్కువగా మాటలాడలేదు. పిల్లవాడ్ని పిలిపిస్తా నన్నాను వద్దంది. అయినా శారదకు టెలిగ్రామ్ యిచ్చాను తీసుకురమ్మని.

ఏం తోచటములేదు. ఈ రాత్రి గడవా లన్నాడు డాక్టరు.

ఇక నేను బ్రతకనండి! నాకు తెలుసు. ఏమండీ ఒక్కకోరికవుంది తీరుస్తారూ!

ఏమిటి?

నన్ను మీకౌగిట్లోకితీసుకొని తనివితీరా ఒక ముద్దుపెట్టుకోండి. ఇదే మొదటిదీ.... అఖరిదీనూ. నేను మీకు యింతకంటే ఏమీ యివ్వలేను. దగ్గరగా చేర్చు కున్నాను.

నాకు యిప్పుడు ఎంతో హాయిగా ఉన్న దండి! సంతోషమూ లేదు విచారమూలేదు కోర్కెలులేవు క్రోధములేదు మమకారము లేదు అసూయలేదు.

నా చేతిని తన హృదయానికి చేర్చు కుంటూ 'కాసేపు యిక్కడే కూర్చోండి' అని అంది, అలాగే ప్రక్కమీద కూర్చున్నాను

పది నిమిషాలు గడిచింది. నాకు అను మానంవేసింది. ఆమెలో చలనంలేదు.

నెమ్మదిగా క్రిందకు వచ్చాను. లలిత దిగులుగా కూర్చుంది, మామగారు డాక్టర్ని తీసుకొనిరావటానికివెళ్లారు. ఇంకారాలేదు.

బయట కారాగిన చప్పుడయింది. శారద పిల్లవాడ్ని తీసుకొనివచ్చింది. వెంట ఆమె తండ్రిగారు కూడ వున్నారు.

ఇక అవసరంలేదు అంతా అయి పోయింది వెళదాంరండి అని అన్నాను.

అందరంవచ్చి కూర్చున్నాం, కారు నెమ్మదిగా బయలుదేరింది.

★


# కస్తూరి మాత్రలు

జలుపు, సాధారణ శీతలము చేత దగ్గులు, జ్వరము, గొంతులో కరకరమని యుండుట తల భారము మొదలగు వాటిని పోగొట్టును. ఈ మాత్రలు బిడ్డలు మొదలు వృద్ధులువరకు ఎంత వయస్సుండి నను వాడుకోవచ్చును.

25 మాత్రలు గల బుడ్డి 1-కి రు. 1=00

తపాలా ఛార్జి రు. 1=12.

ధనలక్ష్మి అండ్ కో.,

తపాల్ పెట్టె నెం. 1376, మద్రాసు-1.